క్లుప్తంగా

నేడు ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం సుజాతనగర్, కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఉదయం సుజాతనగర్ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులతో సమావేశమవుతారు. ఆ తర్వాత కొత్తగూడెం విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు. సాయంత్రం రామవరం, గౌతమ్‌నగర్, కూలీలైన్, న్యూ గొల్లగూడెంల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడతారు.

టాస్క్‌ఫోర్స్ సీఐగా రమాకాంత్

కొత్తగూడెంరూరల్: టాస్క్‌పోర్స్ సీఐగా ఎ.రమాకాంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ బెల్లం సత్యనారాయణ ఖమ్మం ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆ స్థానంలో రమాకాంత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

బార్ అసోసియేషన్ ఆదర్శంగా నిలవాలి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ అసోసియేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. గురువారం కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్‌ను మరింతగా అభివృద్ధి చేయడానికి కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో తోట మల్లేశ్వరావు, ఎంఎస్ ఆర్.రవిచంద్ర, సాధిక్‌పాషా, డి.రవికుమార్, ఎ.ప్రతిభ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో గ్రూపులు కొనసాగించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఎయిడెడ్ గ్రూపులను కొనసాగిస్తూ లెక్చరర్ల ఉద్యోగాలకు భరోసా కల్పించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘాల ప్రధాన కార్యదర్శి కోట శివ శంకర్ కోరారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరామ్‌కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కళాశాలలో గ్రూపులు తొలగిస్తే సీనియర్ లెక్చరర్లను బదిలీ చేయాల్సి వస్తుందని, తద్వారా ప్రవేశాలు తగ్గుతాయని తెలిపారు.

ప్రవేశాలకు ఆహ్వానం

పాల్వంచ: ఓపెన్ టెన్త్, ఇంటర్ చదవాలనుకునే అభ్యర్థులు సెప్టెంబర్ 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం గౌతమి ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్ల అవగాహన వాల్ పోస్టర్లను పట్టణ ఎస్‌ఐ సుమన్, డిప్యూటీ తహసీల్దార్ చందర్, మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చదువు మధ్యలో ఆపేసిన వారికి ఉన్నత చదువులు చదువుకునేందుకు ఇది చక్కని అవకాశం అన్నారు. వివరాలకు 9247238871 నంబరులో సంప్రదించాలని కోరారు.

పీఓడబ్ల్యూ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి: ప్రగతి శీల మహిళా సమాఖ్య (పీఓడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకురాలు పూసం రుక్కమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండలం పరిధిలోని బోడుకొత్తగూడెం గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. మాట్లాడుతూ... ఈ మహాసభలు ఈనెల 31, సెప్టెంబర్ 1 , 2 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్నాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి..

ఇల్లెందు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాస్‌లైన్ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కమిషనర్ యాదగిరికి విన్నవించారు. గురువారం ఇల్లెందులో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులకు పీఆర్‌సీ, పీఎఫ్, ఈఎస్‌ఐ, మేడే కానుక, ఇన్సూరెన్స్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు ఆందోళన చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

టేకులపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, విద్యార్థులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. గురువారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బద్దుతండా, రామచంద్రునిపేట, కొత్త తండా (జి), కోయగూడెం, చింతోని చెలక తండా, బేతంపూడి, రాజారాం తండా, వజ్జోనిగూడెం గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ దినేష్ మాట్లాడారు.

క్షణక్షణం.. భయం భయం

కొండలు.. గుట్టలు.. చెట్లు చేమలపై కనిపించే వానరాలు ఇప్పుడు జనావాసాల్లో సంచరిస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లల్లో చొరబడి దొరికిందల్లా ఎత్తుకెళ్తున్నాయి. పగలూ.. రాత్రి తేడా లేకుండా పల్లెల్లో వానర సైన్యం ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. అయినా వానరాలను అదుపు చేసేందుకు స్థానిక సంస్థలతోపాటు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- వీధులలో గుంపులుగా కోతుల సంచారం
- ఆదమరిస్తే తప్పని దాడులు
- బయటకు రావాలంటేనే హడలిపోతున్న ప్రజలు



మొండితోడు గ్రామంలో కోతుల సంచారం

ఇల్లెందురూరల్: ఏటేటా కోతుల సంఖ్య పెరుగుతోంది. రానున్న రోజుల్లో మనుషుల జనాభాను మించిపోయేలా ఉంది. కుటుంబ నియంత్రణ చికిత్స చేసే అవకాశం లేకపోవడంతో వీటి సంఖ్య పెరుగుతూనే ఉంది. కోతుల నియంత్రణకు గతంలో ప్రభుత్వాలు ఆదేశాలు ఇచ్చినా నిధులు విడుదల చేయకపోవడంతో అమలు కాలేదు. కోతులను పట్టుకొని అడవుల్లో వదిలేందుకు నిధులైనా విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫలితమివ్వని రక్షణ చర్యలు.. గ్రామాలలో గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. పండ్ల తోటలు, చేలను ధ్వంసం చేస్తున్నాయి. తలుపు తెరిచి ఉంటే చాలు ఇంట్లో జొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. గృహోపకరణాలను చిందరవందర చేస్తున్నాయి. ఆ సమయంలో అడ్డగించే ప్రయత్నం చేస్తే మనుషులపై దాడి చేస్తున్నాయి. దీంతో ఆర్థికం భారమైనా ఇండ్లకు మెష్ డోర్‌లు, గ్రిల్స్ ఏర్పాటు చేసుకోక తప్పడం లేదు. గ్రామాలలో ప్రధాన ద్వారాలకు జాలి (మెష్) లేని ఇళ్లు లేవంటే అతిశయోక్తి కాదు. గ్రామాల్లోని పెంకుటిళ్లను, రేకుల ఇళ్లను వానరాలు పీకి పెడుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల పైకప్పులపై కంప వేస్తున్నారు. అయినా వాటి తీవ్రత తగ్గకపోవడంతో ఇంటి చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకుంటున్నారు. విద్యార్థుల సంచులు, టిఫిన్ బాక్స్‌లను లాక్కెళ్తున్నాయి. ఇవ్వకుంటే కరిచిన సందర్భాలున్నాయి. గ్రామాల్లో కోతుల సంచారం అధికం కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

బయటకు వెళ్లాలంటే.. ప్రస్తుతం గ్రామాల్లో వృద్ధులు, చిన్నారులు కాలినడకన బయటకు వెళ్లాలంటే చేతిలో తప్పక కర్ర ఉండాల్సిందే. ముఖ్యంగా వాకింగ్ చేసేవారిలో వయోభేదం లేకుండా చేతికర్రను వెంటపెట్టుకోక తప్పని పరిస్థితి. ఏ వీధిలో చూసినా వానరాలే దర్శనమివ్వడంతో గమ్యం చేరుకునే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయం భయంగా రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో కోతులను భయపెట్టేందుకు వీధుల్లో కొండముచ్చులను తిప్పేవారు కానీ, నేడు వాటికి కూడా కోతులు భయపడటం లేదు. దీంతో ప్రజలు కోతులను రక్షించుకునేందుకు కర్ర, గుల్బర్‌లను ప్రస్తుతం ఆయుధాలుగా వినియోగించక తప్పడం లేదు.

కోతులతో ఇబ్బంది పడుతున్నాం..



కోతుల సంచారం అధికమైంది. ఇంటికి, దుకాణానికి రక్షణగా ఇనుప మెష్‌లు ఏర్పాటు చేసుకున్నా ఇబ్బందులు తప్పడం లేదు. వీధులలో వెళ్తుంటే వెంటపడి గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి తక్షణం వాటిని నియంత్రించే పనులు చేపట్టాలి. – వెంకటేశ్వర్లు, బాలాజీనగర్

ఇంటిని గుల్ల చేస్తున్నాయి..



గ్రామాల్లో కోతులు సమూహంగా సంచరిస్తున్నాయి. ఇంటి ఆవరణలో పూలమొక్కలను పీకేస్తున్నాయి. కూరగాయల మొక్కలు, గృహోపకరణాలను ఛిద్రం చేస్తున్నాయి. అధికారులు స్పందించి కోతుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి. – వెంకటలక్ష్మి, తిలక్‌నగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



గ్రామాలలో కోతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి అనుమతితో కోతులను నియంత్రించే చర్యలు తీసుకుంటాం. గ్రామాలలో యువతను ఐక్యం చేసి కోతులను అడవుల వరకు తరిమేలా మరో ప్రయత్నం కూడా చేపడతాం. – ధన్‌సింగ్, ఎంపీడీఓ, ఇల్లెందు

ప్రభుత్వాస్పత్రికి నిధులు మంజూరు

పాల్వంచ: పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధునికీకరణను త్వరలో చేపడతామని, ఇందుకు డీఎంఎఫ్ నిధులు రూ.79.40 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించారు. వార్డుల్లో పర్యటించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు అతలాకుతలం అవుతున్న తరుణంలో వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. సూపరింటెండెంట్ నిత్య పర్యవేక్షణ చేస్తూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. త్వరలోనే డయాలసిస్ యూనిట్లను ప్రారంభిస్తామన్నారు. వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రి నూతన భవన నిర్మాణాల కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రవిబాబు, సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్‌ఎంఓ సోమరాజు దొర, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రాహుల్, సుధాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గిరి పాల్గొన్నారు.

వచ్చే నెల 2నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

జూలూరుపాడు: వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ పిలుపునిచ్చారు. జూలూరుపాడులో గురువారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్ బూత్‌లో 200 కంటే ఎక్కువ మందితో సభ్యత్వాలు చేయించాలని సూచించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేయడంలో విఫలమైందన్నారు. ఈ విషయంతో పాటు కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగులతో పాటు పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను విస్మరించిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో మాదినేని సతీష్, నున్నా రమేష్, సిరిపురపు ప్రసాద్, భూక్యా రమేష్, సిరిపురపు పుల్లారావు, నర్వనేని కృష్ణ, వెంకటేశ్వర్లు, వందనపు సుబ్బు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: మాట్లాడుతున్న రమేష్

పాల్వంచరూరల్: బీజేపీ బలోపేతం కోసం పార్టీలోని ప్రతి బూత్‌లోని అధ్యక్షుడు రెండు వందల సభ్యత్వాలను నమోదు చేయించాలని పార్టీ సభ్యత్వ నమోదు కమిటీ జిల్లా కన్వీనర్ పానిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పట్టణంలో గురువారం పట్టణ కమిటీ సమావేశం జరిగింది. పానిశెట్టి మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిఉన్న పార్టీ బీజేపీ అన్నారు. ఈ సమావేశంలో భూక్యా రవినాయక్, మాదారపు లక్ష్మణ్, బట్టు శివ, మాలోతు ప్రశాంత్, నందిగాం వెంకటరమణ, కల్లోజు నాగరాజు, తాటికొండ కళ్యాణ్, దున్నపోతుల రాజు, ముత్యాల భాస్కర్, వంశీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ధృవపత్రాలు పంపిణీ



ధృవీకరణ పత్రాలు అందుకున్న విశ్వకర్మ సభ్యులతో అధికారులు

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా శిక్షణ పొందిన విశ్వకర్మ సభ్యులకు గురువారం వైటీసీలో ధృవకరణ పత్రాలను జిల్లా విశ్వకర్మ ప్రత్యేకాధికారి వద్దిరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణ పొందిన విశ్వకర్మ సభ్యులు ధృవీకరణపత్రాలతో రూ.లక్ష వరకు బ్యాంకు నుంచి రుణాలు పొందవచ్చని చెప్పారు. దీనికి బ్యాంకు వడ్డీ 17పైసలు కాగా, 13 పైసల వడ్డీని కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందని, అంటే కేవలం రూ.5పైసలు వడ్డీతో రుణాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు రాంబాబు, వెంకటేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ జన సమితి పార్టీని బలోపేతం చేయడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్‌రావు అన్నారు. గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లా జనరల్ బాడీ సమావేశం కొత్తగూడెం పట్టణంలో ప్రకృతి ఆశ్రమంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బరకడ దేవదానం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్‌రావు మాట్లాడారు.

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సమావేశాన్ని నియోజకవర్గం, మండలాల నుంచి పార్టీ జిల్లా మండల బాధ్యులు హాజరై పార్టీ నిర్మాణంపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్కె నబీ, వడ్డెబోయిన బాబు, పగడాల కరుణాకర్‌రెడ్డి, కుడికాల ఆంజనేయులు, వల్లాల భరత్, సర్దార్ రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌రావు

సీపీఎం నాయకుడికి పరామర్శ



అయిలయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సింగరేణి(కొత్తగూడెం)/సుజాతనగర్/సూపర్ బజార్(కొత్తగూడెం): అనారోగ్యంతో ఖమ్మంలో చికిత్స పొందుతున్న సీపీఎం నాయకుడు కాసాని అయిలయ్యను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ, సీపీఎం నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, అన్నవరపు కనకయ్య, కె.నర్సయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, వీర్ల రమేష్, వంశీ, ప్రశాంత్ ఉన్నారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాస్‌ల శిబిరం

చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్‌లో శుక్రవారం చుంచుపల్లి మండలంలోని దివ్యాంగులకు బస్‌పాస్‌ల జారీ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డీఎం ఎం.దేవేందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తామని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: పట్టణంలో ఇటీవల మృతి చెందిన మధ్యానం వీరభద్రం కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. 1992–93 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు వీరభద్రం కుటుంబాన్ని గురువారం సందర్శించారు. రూ.40వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకీరామ్, స్నేహితులు రమేష్, శ్రీను, దోమల ప్రవీణ్, వీరయ్య, మోహన రావు, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

కోరం లేకుండా సమావేశమా..?



మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం కోరం లేకుండా నిర్వహించారని బీఆర్‌ఎస్ పక్షం సభ్యులు ఆక్షేపించారు. దిండిగల రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన సభ్యులు సమావేశమై కౌన్సిల్ జరిగిన తీరును తప్పుబట్టారు. 24 మంది గల పాలక వర్గంలో ఎక్స్ అఫీషియోతో కలిపి 25 మంది ఉండగా కనీసం 13 మంది ఉండాలని తెలిపారు. 12 మందికే కోరం పూర్తైనట్లు ప్రకటించుకున్నారని పేర్కొన్నారు. ఏకపక్షంగా సమావేశం నిర్వహించి తీర్మానాలు చేసుకున్నారని ఆరోపించారు. సిలివేరు సత్యనారాయణ, కౌన్సిలర్లు తోటలలిత శారద, సామల మాదవీ, జేకే శ్రీను, అనిత, సందా బిందు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ సమావేశం గురువారం చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. 12 మంది సభ్యులు హాజరు కాగా, మరో 12మంది గైర్హాజరయ్యారు. మున్సిపల్ సమావేశం జరగకుండా తమ పార్టీ సభ్యులు గైర్హాజరయ్యేలా బీఆర్‌ఎస్ సభ్యులను కౌన్సిల్ సమావేశానికి హాజరుకావద్దంటూ సూచించారు. అయితే ఇద్దరు సభ్యులు కటకం పద్మావతి (2వ వార్డు), యలమందల వీణ (5వ వార్డు)లు హాజరయ్యారు. ఇదిలా ఉండగా 24 మంది సభ్యుల్లో సగానికి ఎక్కువ మంది ఉంటేనే కోరం ఉన్నట్లు బీఆర్‌ఎస్ సభ్యులు భావిస్తుండగా... 24 మందిలో 1/3 వంతు మంది ఉంటే కోరం ఉన్నట్లేనని ప్రభుత్వ జీఓ ఉందని అధికార పక్షం పేర్కొంటోంది.

25 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ముఖ్యంగా 2వ వార్డులో హిందూ శ్మశానవాటికకు వెళ్లే దారిలో గల వాగు మీద ఐరన్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ బి.యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, డీఈ మురళీకృష్ణ, ఏఈ కుమారస్వామి, ఏఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాస్, ఎస్‌ఐ రాధాకృష్ణ, కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి (బీఆర్ఎస్), కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజమ్, యలమందల వీణ (బీఆర్‌ఎస్), రేళ్ల నాగలక్ష్మి (ఎన్‌డీ), మొగిలి లక్ష్మి, అంకెపాక నవీన్, కుమ్మరి రవీందర్ (సీపీఐ), కోఆప్షన్ సభ్యుడు నాగమణి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది

మోటార్ కార్మికుల సంక్షేమానికి కృషి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న మోటార్ కార్మికుల సంక్షేమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య సహాయ సహకారం ఎప్పటికీ ఉంటుందని, ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఇల్లెందులోని ఆటోనగర్‌లో ఇల్లెందు ఆటోనగర్ ఆల్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఆటో మోటార్ వర్కర్స్ సభ్యులు సమష్టిగా తమ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జానీపాషా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్, జాఫర్, ఆటో మోటార్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా శ్రీనివాస్, గొల్లమండల మల్లేష్, సంజయ్‌కుమార్, పోలు శ్రీనివాస్, అజీమ్, షఫీ, బారీ, యాకుబ్, గౌస్, సలీం, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించండి..

పాల్వంచరూరల్: మహిళా గ్రూపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను కుటీర పరిశ్రమలు, వ్యాపారాలకు వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండల సమైఖ్య అధ్యక్షురాలు కుమారి అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడారు. మహిళా సంఘాలు ఆర్థిక విషయాల్లో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, ఆడిట్ లెక్కలను గ్రూపు సభ్యులకు తెలియజేయాలని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, ఎంపీఓ బి.నారాయణ, డీపీఎంలు సునందన్, యాదయ్య, ఏపీఓ రంగా, కార్యదర్శి లక్ష్మీకాంతమ్మ, కోశాధికారి చుక్కమ్మ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ పద్మ, శ్రీను, రవికుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాల నుంచి ప్రజలను రక్షించాలి

ఇల్లెందురూరల్: ప్రస్తుతం పల్లెల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని, వాటి బారి నుంచి ప్రజలను రక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా అత్యవసర మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మంతెన వసంతరావు డిమాండ్ చేశారు. కొమరారం గ్రామంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రామంలో చూసినా టైఫాయిడ్, డెంగీ జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాలలో సరైన వైద్యం అందక ప్రజలు మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా జ్వరాలకు ప్రధాన కారణమైన దోమల నిర్మూలన పనులు చేయడం లేదని, వైద్యశాఖపరంగా దోమతెరల పంపిణీ కూడా చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వైద్యశిబిరాలు పెంచడంతోపాటు అవసరమైన మందులను తక్షణం అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రడం శ్రీనివాస్, రామటెంకి అశోక్, ఎట్టి ప్రశాంత్, బానోత్ లక్‌పతి, రాఘవులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి

జూలూరుపాడు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, డీన్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో ధ్యాన్‌చంద్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వనజ, అధ్యాపకులు పాల్గొన్నారు.



కొత్తగూడెంరూరల్: ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కొత్తగూడెంఅర్బన్: గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: వ్యవహారిక భాషకు గొడుగు పట్టిన భాషా పిడుగు, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా, హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా గురువారం సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సాయిసుజాత మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులు తెలుగుపై మక్కువను పెంచుకోవాలని ఎన్ని భాషలు నేర్చుకున్నా కన్నతల్లి వంటి అమృతమైన మాతృభాష వదలొద్దన్నారు.

ఈ కార్యక్రమంలో పూల్‌సింగ్, ధనలక్ష్మి, తెలుగు ఉపాధ్యాయినులు సీరప్రసన్న, స్వర్ణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు లావణ్య, సంజయ్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య, సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, కవి జయదాసు, అధ్యాపకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ రమేష్, ప్రభాకర్, నాగేశ్వరరావు, వెంకట్, రాకేష్, డాక్టర్ శ్రీదేవి, రాజు, సరిత, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీకేఎంయూ అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక శేషగిరిభవన్‌లో గురువారం వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ పేదలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఇంటిస్థలాలు లేని వ్యవసాయ కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. రేషన్ కార్డులు మంజూరు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, పేదలందరికీ కూలిబంధు ప్రవేశపెట్టి రూ.10వేలు ఇవ్వాని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ధర్నా కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చంద్రగిరి శ్రీనివాస్, నూనావత్ గోవిందు, బొర్ర కేశవరావు, సుంకిపాక ధర్మా, సడియం నాగరాజు, బిక్కులాల్ తదితరులు పాల్గొన్నారు.